

తన చావుకు సీఎం రేవంత్‌రెడ్డి బ్రదర్స్ కారణమని సాయిరెడ్డి రాసిన సూసైడ్ నోట్

నా చావుకు రేవంత్ బ్రదర్సే కారణం

వాళ్ల బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్న

- దారిస్తామని చెప్పి నా ఇంటికి అడ్డంగా గోడ కడుతున్నరు
- నేను ఏ పార్టీలోనూ లేను.. నాది దేవుడి పార్టీ..
- నా మీద నింద మోపిండ్రు.. ఈ పరిస్థితి వస్తదనుకోలేదు
- సూసైడ్ నోట్‌లో కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): 'సీఎం రేవంత్‌రెడ్డి అన్నదమ్ములు పెట్టే బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నా' అని సీఎం సొంతూరైనా కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాంకుంట సాయిరెడ్డి సూసైడ్ లెటర్ రాసి శుక్రవారం బలవన్మరణానికి పాల్పడడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. 'నేను పాంకుంట్ల సాయిరెడ్డి, తండ్రి రంగారెడ్డి, మాజీ సర్పంచ్. మా గ్రామంలో సుమారు 40 ఏండ్ల క్రితం సొంత ఇల్లు నిర్మించుకున్న.. దారి కోసం ఇంటి ముందున్న పాడుబడ్డ బావిబొందను సొంత ఖర్చులతో పూడ్చుకున్న. ఇంటికి పాల బూత్ పక్కనుంచి దారి చేసుకున్నా. కానీ ప్రస్తుత సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి బ్రదర్స్ నా మీద కక్షగట్టిండ్రు. నా ఇంటి ముందర పశువుల దవాఖాన కట్టిండ్రు. అయినా నేను ఎలాంటి ఆక్షేపణ చేయలేదు. దవాఖాన పక్క నుంచి నా ఇంటికి దారి ఇడువమని కోరిన. నా ఇంటికి దారి ఇడుస్తామని చెప్పిండ్రు. కానీ వాళ్లు నా మీద పార్టీల నింద మోపి నా ఇంటి దారికి అడ్డంగా గోడ నిర్మించుకునేందుకు పూనిండ్రు. నేను ఏపార్టీ కాదు. నాది ప్రస్తుతం దేవుని పార్టీ. ఇలాంటి పరిస్థితి వస్తుందని నేను అనుకోలేదు. నా ఇంటికి దారి ఉండదని అనుకోలేదు. అందుకే బాధతో చనిపోతున్నా. 'జై సీతారామ, జై శివపార్వతులు, జై ఆంజనేయ, జై వీర బ్రహ్మం, నా చావు ఈ దేవుండ్లకు అంకితం..' అని సాయిరెడ్డి తన సూసైడ్ లేఖలో పేర్కొన్నాడు.

పాంకుంట్ల సాయిరెడ్డి (ఫైల్)

రేవంత్ బ్రదర్స్ వల్లే.. చచ్చిపోతున్న!

మొదటిపేజీ తరువాయి...

సంచలనం సృష్టించింది. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో సీఎం సొంత ఊరు కొండారెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి (85) కల్వకుర్తిలో శుక్రవారం సాయంత్రం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఎం రేవంత్ బ్రదర్స్ వేధింపుల వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు లేఖ రాశాడు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో లగచర్ల ఘటన నుంచి ప్రజలు తేరుకోకముందే ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి స్వగ్రామంలో సీఎం సోదరుల వేధింపులతో ఓ మాజీ సర్పంచ్ బలవన్మరణానికి పాల్పడడం కలకలం రేపింది.

ఉన్నది ఉన్నట్టు మాట్లాడే వ్యక్తిత్వం

సాయిరెడ్డికి గ్రామంలో మంచిమనిషిగా పేరున్నది. ఆయన పార్టీలకు అతీతంగా ఉంటారని, నిజాయతీపరుడని, ఉన్నది ఉన్నట్టు కుండబద్దలుకొట్టి మాట్లాడే వ్యక్తిత్వం తనదని ఊరివాళ్లు చెప్తున్నారు. గ్రామంలో ఎవరైనా తప్పు చేస్తే నేరుగా హెచ్చరించేవాడని, రేవంత్‌రెడ్డి కుటుంబ అరాచకాలపైనా పలుమార్లు నిలదీశాడని, ఓ యూట్యూబ్ చానల్‌కు ఇంటర్వ్యూ కూడా ఇచ్చాడని తెలిసింది. దీనిపై కక్షపెట్టుకొని రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు తన ఇంటి ముందు పశువుల దవాఖాన, కంపౌండ్ వాల్ కడుతున్నామని చెప్పి ఇంటికి వెళ్లేందుకు కనీసం దారి కూడా లేకుండా గోడ నిర్మించారని, నిందలు వేశారని ఈ బాధలు భరించలేకనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సాయిరెడ్డి లేఖలో పేర్కొన్నాడు.

దారి కోసం వేడుకున్నా..

తన ఇంటికి వెళ్లేందుకు కనీసం నడకదారి అయినా ఇవ్వాలని సాయిరెడ్డి గ్రామ కార్యదర్శిని, రేవంత్‌రెడ్డి అనుచరులను వేడుకున్నాడు. సాయిరెడ్డిని చూసి రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి అనుచరులు వెకిలిగా మాట్లాడారని, తగిన శాస్తి చేస్తామంటూ బెదిరింపులకు దిగారని తెలిసింది. 'మా ఇంటికి వెళ్లేందుకు దారి ఇవ్వకుంటే నాకు చావే దిక్కు' అని రేవంత్‌రెడ్డి అనుచరుడికి సాయిరెడ్డి చెప్పగా 'నువ్వు చస్తే చావు' అంటూ దురుసుగా ప్రవర్తించినట్టు గ్రామంలో చర్చ నడుస్తున్నది. ఇటీవల హైదరాబాద్ నుంచి కొండారెడ్డిపల్లికి వెళ్లిన మీడియా ప్రతినిధులతో అసభ్యంగా ప్రవర్తించి, వాళ్ల ఫోన్లను లాక్కున్నది ఆ అనుచరుడేనని, సాయిరెడ్డితో కూడా దురుసుగా వ్యవహరించింది అతడేనని తెలిసింది.

ఉదయమే ఆత్మహత్యకు ప్రయత్నించి..

శుక్రవారం ఉదయం 7గంటలకు పురుగుల మందు డబ్బా తీసుకొని గదిలోకి వెళ్లి సాయిరెడ్డి తలుపులు మూసుకున్నాడు. కుటుంబసభ్యులు ఎంత పిలిచినా బయటకు రాకపోవడంతో గ్రామస్తులతో కలిసి తలుపులు బద్దలు కొట్టి బయటకు తీసుకొచ్చారు. మాజీ సర్పంచ్ ఆత్మహత్యాప్రయత్నం గ్రామంలో పాకడం, సూసైడ్ నోట్ రాసి పెట్టుకున్నాడని తెలియడంతో కలకలం రేగింది. వెంటనే సమాచారం అందిన వంగూరు పోలీసులు హుటాహుటిన చేరుకున్నారు. కుటుంబ సభ్యుల నుంచి బలవంతంగా సూసైడ్ నోటును తీసుకెళ్లిపోయారు. అప్పటికే కొంతమంది ఈ సూసైడ్ నోట్‌ను సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కల్వకుర్తి వెళ్లొస్తానని చెప్పి..

ఉదయం జరిగిన ఘటన తర్వాత అంతా సద్దుమణిగింది అనుకున్న తరుణంలో మధ్యాహ్నం సాయిరెడ్డి కల్వకుర్తికి వెళ్లొస్తానని చెప్పి ఇంట్లోవారిని నమ్మించి బయలుదేరాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఓ పెట్టిసైడ్ షాపులో మళ్లీ పురుగుల మందు కావాలని అడగగా అనుమానం వచ్చిన వ్యాపారి ఇవ్వలేదు. ఓ మెడికల్ షాప్‌కు వెళ్లి నిద్ర మాత్రలు కావాలని అడిగాడు. చివరకు ఓ దుకాణంలో పురుగుల మందు డబ్బా కొనుకున్నాడు. కల్వకుర్తి బస్టాండ్ సమీపంలోని రఘుపతిపేట రహదారిలో బండరాయిపై కూర్చుని పురుగుల మందు తాగి కుప్పకూలాడు. అటుగా వెళ్తున్న కొందరు గమనించి ఎవరని ఆరా తీయగా కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ అని తెలియడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

కాంగ్రెస్‌లో క్రియాశీల పాత్ర

కాంగ్రెస్‌లో క్రియాశీలక పాత్ర పోషించిన సాయిరెడ్డి కొండారెడ్డిపల్లి గ్రామానికి రెండు దఫాల్లో 13 ఏండ్లపాటు సర్పంచ్‌గా వ్యవహరించారు. పార్టీ కోసం అహర్నిశలూ కష్టపడ్డారు. గ్రామాభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేశారన్న పేరు సాయిరెడ్డికి ఉన్నది. అతడికి భార్య రామలక్ష్మి, ఇద్దరు కొడుకులు మాధవరెడ్డి, వెంకటరెడ్డి, కూతురు సులోచన ఉన్నారు. కాగా వెంకటరెడ్డి వారం క్రితమే అమెరికా వెళ్లగా అతడు వచ్చాక సాయిరెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

పాంకుంట్ల సాయిరెడ్డి ఇంటి ఎదుట నిర్మించిన పశువుల దవాఖాన

జేసీబీకి అడ్డంపడి.. అవమానభారంతో

కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్‌కు, ప్రైవేట్ సైన్యానికి గురువారం ఘర్షణ జరిగింది. కాంపౌండ్ వాల్ పనులు జరుగుతుండగా సాయిరెడ్డి వెళ్లి జేసీబీకి అడ్డంపడ్డాడు. అక్కడే ఉన్న పంచాయతీ సిబ్బంది, వంగూరు పోలీసులు, రేవంత్ బ్రదర్స్ అనుచరులు సాయిరెడ్డిని లాగేసి బెదిరించి ఇంటికి పంపించారు. రెండుసార్లు గ్రామానికి సర్పంచ్‌గా ఉండి తన ఇంటికి అడ్డంగా గోడ కడుతున్నా ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నానంటూ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గోడ కట్టవద్దని ఎంత అడ్డుకున్నా దౌర్జన్యంగా కట్టడంతో తీవ్ర ఆవేదనకు గురైన సాయిరెడ్డి ఇంటికి వెళ్లి సూసైడ్ నోట్ రాసుకున్నాడు.

నాలుగు రోజులుగా తీవ్రమైన వేధింపులు

ఆగస్టు నుంచి సాయిరెడ్డిని రేవంత్ సోదరులు టార్గెట్ చేసినట్టు తెలిసింది. అంతకు ముందు నుంచే ఇబ్బందులు పెట్టాలని చూసినా ఆగస్టు నుంచే వేధింపులు తీవ్రమైనట్టు తెలుస్తున్నది. సాయిరెడ్డి తన ఇంటిని 40 ఏండ్ల క్రితం నిర్మించుకున్నాడు. ఇంటి సమీపంలో పాడుబడ్డ బాయి బొంద ఉంటే సొంత ఖర్చులతో పూడ్చి దారిగా మార్చుకున్నాడు. ఇక్కడ ఇప్పుడు పశువుల దవాఖాన, కాంపౌండ్ వాల్ కట్టాలని రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు పనులు మొదలుపెట్టారు. నాలుగు రోజుల నుంచి సాయిరెడ్డి ఇంటికి వెళ్లే దారి మొత్తాన్ని మూసివేసే దిశగా నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయంపై వంగూరు ఎస్ఐకి సాయిరెడ్డి చెప్పినా పట్టించుకోలేదని తెలిసింది.

బెదిరించి కొట్టి.. సావుదాకా తెచ్చిండ్రు

మా ఇంటికి పోకుండా గోడ అడ్డం కడుతుంటే మా నాన్న చాలా బాధపడ్డడు. ఊర్లో గ్రామ పంచాయతీ వాళ్లు వంగూరు పోలీసులను తీసుకొచ్చి ఆయనను కొట్టిండ్రు. ఇన్ని రోజులు బెదిరించి ఇప్పుడు సచ్చేదాకా తెచ్చిండ్రు. మా నాన్నను కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు కూడా బెదిరించిండ్రు. సూసైడ్ నోట్లో ఎవరెవరి పేర్లు ఉన్నాయో ఏమో.. మమ్మల్ని ఇబ్బంది పెట్టకుండ్రి.. వాళ్లను ఎదిరించి మేం బతకలేం.

-మాధవరెడ్డి (సాయిరెడ్డి కొడుకు)

లోకం పోకడ

మీ ఇంటి భోజనం బడి పిల్లలకు పంపించి, స్కూలు నుంచి మీ కు ఘుమఘుమలాడే మధ్యాహ్న భోజనం తెప్పించాను సార్!

రేవంత్ సోదరుల అరాచకాలు

ఒక్కొక్కటిగా వెలుగులోకి దారుణాలు

భూ వివాదంలో కొండారెడ్డిపల్లికి చెందిన గురువారెడ్డిని కొట్టి ఆత్మహత్యకు కారణమయ్యారా?

ఈ విషయాన్ని వెల్లడించినందుకే సాయిరెడ్డిపై కక్ష?

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): కొండారెడ్డిపల్లిలో రేవంత్ సోదరుల అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. చాలావరకు వాటిని బయటకు పొక్కకుండా రేవంత్‌రెడ్డి సోదరులు మేనేజ్ చేసినట్టు తెలుస్తున్నది. తమ కుటుంబానికే చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు కూడా రేవంత్ సోదరులే కారణమయ్యారని తెలిసింది. ఇదే విషయాన్ని మాజీ సర్పంచ్ పాంకట్ల సాయిరెడ్డి గతంలో ఓ మీడియా సంస్థకు చెప్పారు. అందుకే అతడిపై రేవంత్ బ్రదర్స్ కక్షగట్టినట్టు తెలుస్తున్నది. సాయిరెడ్డి మీడియా సంస్థకు చెప్పిన వివరాల ప్రకారం.. రేవంత్‌రెడ్డి అన్న కృష్ణారెడ్డి కుటుంబం, వారి కుటుంబానికే చెందిన ఎనుముల గురువారెడ్డి మధ్య మూడేండ్లుగా భూవివాదం ఉన్నది. ఎనుముల కృష్ణారెడ్డి (రేవంత్ సోదరుడు) కుటుంబానికి చెందిన రెండున్నర ఎకరాల భూమిని ఎనుముల గురువారెడ్డితో కల్సి తనఖా పెట్టారు. వచ్చిన డబ్బుల విషయంలో ఇరు కుటుంబాల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో గురువారెడ్డిని రేవంత్‌రెడ్డి అన్న బంధువులు ఫిబ్రవరి 21న రాత్రివేళ కొట్టుకుంటూ తీసుకొచ్చి కొండారెడ్డిపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న బ్రహ్మంగారి గుడిలో రాత్రి బంధించారు. ఆయన తప్పించుకొని వెళ్లకుండా గుడికి తాళంవేశారు. ఊరిలో తన పరువు పోతుందని భావించిన గురువారెడ్డి ఆ రాత్రే ఉరేసుకొని చనిపోయాడు. గుడిని ఊడ్చే వ్యక్తి చూసేసరికి గురువారెడ్డి తన పంచెతో ఉరేసుకొని వేళాడటం గమనించాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా రేవంత్ సోదరులు దాచిపెట్టారని, ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించాడన్న కారణంతోనే సాయిరెడ్డిపై రేవంత్ సోదరులు కక్షగట్టారని తెలిసింది. ఈ విషయంపై రేవంత్‌రెడ్డి అనుచరులు కూడా సాయిరెడ్డి వద్ద పలు సందర్భాల్లో ప్రస్తావించినట్టు తెలిసింది.

సాయిరెడ్డి ఆత్మహత్యకు సీఎందే బాధ్యత

రేవంత్ సోదరుల వేధింపులతోనే బలవన్మరణం

మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తీవ్ర ఆగ్రహం

కల్వకుర్తి, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి ఆత్మహత్యకు రేవంత్‌రెడ్డి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రభుత్వ దవాఖాన మార్చురీలో సాయిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ బాలరాజు ప్ర భుత్వ తీరు, రేవంత్‌రెడ్డి కుటుంబ దౌర్జన్యకాండపై తీ వ్రంగా మండిపడ్డారు. గ్రామంలో దాదాపు 13 ఏండ్లు సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించిన వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. 85 ఏండ్ల సాయిరెడ్డిపై రేంవత్‌రెడ్డి కుటుంబం పగబట్టడం దారుణమని అన్నారు. రేవంత్‌రెడ్డి సోదరుల ఆగడాలు తట్టుకోలేకే సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.

శంకర్‌నాయక్‌ను అరెస్టు చేయొద్దు

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత శంకర్‌నాయక్‌ను డిసెంబర్ 2 వరకు అరెస్ట్ చేయొద్దని వరంగల్ పోలీసులకు హైకోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. లగచర్ల ఘటనలో పోలీసుల చర్యకు నిరసనగా బీఆర్ఎస్ ఈ నెల 25న నిర్వహించతలపెట్టిన కార్యక్రమంలో పాల్గొంటే పోలీసులు తనను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయని, తాను ధర్నాలో పాల్గొనేందుకు, పోలీసులు అరెస్టు చేయకుండా ఉండేందుకు వీలుగా ఉత్తర్వులు జారీ చేయాలని శంకర్‌నాయక్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన జస్టిస్ కే లక్ష్మణ్.. పిటిషనర్ ధర్నాలో పాల్గొనడానికి అనుమతి ఇచ్చారు. విచారణను వచ్చే నెల 2కి వాయిదా వేసింది.

లగచర్ల ఘటనలో 3 ఎఫ్ఐఆర్‌లపై వివరాలివ్వండి

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): లగచర్లలో అధికారుల కార్యక్రమంలో రైతులు దాడి చేశారంటూ బొంరాస్‌పేట పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లను ఎందుకు నమోదు చేశారో పూర్తి వివరాలు అందజేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఒక నేరానికి సంబంధించి మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తరపున ఆయన భార్య శృతి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కే లక్ష్మణ్ విచారించారు.

నేడు నరేందర్‌రెడ్డితో కేటీఆర్ ములాఖత్

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): లగచర్ల కుట్ర కేసులో అరెస్టై చర్లపల్లి జైలులో ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్‌రెడ్డితో శనివారం ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ములాఖత్ కానున్నారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతారని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. మాజీ మంత్రులు వీ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి కూడా పాల్గొననున్నారు.

దుద్యాల మండలంలోని ఫార్మా బాధిత గ్రామాల్లో రైతు కుటుంబాలతో మాట్లాడుతున్న ఐద్వా బృందం

ఫార్మా బాధిత రైతులకు అండగా ఉంటాం

ఐద్వా రాష్ట్ర నేతలు మల్లు లక్ష్మి, అరుణ

ఫార్మా పరిధిలోని రైతుల పరామర్శ

కొడంగల్, నవంబర్ 22 : రైతులను ఇబ్బంది పెట్టి ఫార్మా కంపెనీల ఏర్పాటుకు భూసేకరణ చేపట్టే విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని ఐద్వా నేతలు సూచించారు. బాధిత రైతులకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, కార్యదర్శి అరుణజ్యోతి, జిల్లా కార్యదర్శి అనసూయ తదితరులు శుక్రవారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని హకీంపేట, పోలెపల్లి, పులిచెర్ల కుంట తండా, రోటిబండ తండా, లగచర్ల గ్రామాలను సందర్శించి ఫార్మా భూ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లగచర్ల ఘటనను తీవ్రంగా ఖండించారు. లగచర్ల గ్రామంలో పోలీసులు అర్ధరాత్రి కరెంటు తీసి తలుపులు కొట్టి దొరికిన మగవాళ్లని స్టేషన్‌కు తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అన్యాయమని ఎదురు తిరిగిన మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇది సీఎం బ్రదర్స్ చేసిన హత్యే

- సాయిరెడ్డిది ఆత్మహత్య కాదు
- దీనికి రేవంతే బాధ్యత వహించాలి
- ఎనుముల బ్రదర్స్‌పై కేసు పెట్టాలి
- మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్
- శ్రుతిమించిన రేవంత్ సోదరుల అరాచకాలకు ఇదే నిదర్శనం : హరీశ్
- పిచ్చుకల మీద బ్రహ్మాస్త్రమా? : నిరంజన్‌రెడ్డి
- రాక్షస మనస్తత్వానికి సాక్ష్యం : శ్రవణ్

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి స్వగ్రామానికి చెందిన కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డిది ఆత్మహత్య కానే కాదని, అది సీఎం సోదరులు చేసిన హత్యేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్‌లో చాలా స్పష్టంగా ముఖ్యమంత్రి బ్రదర్స్ తనపై కక్షకట్టడం వల్లే చనిపోతున్నానని సాయిరెడ్డి స్పష్టంచేసిన నేపథ్యంలో ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సూసైడ్ నోట్ ఆధారంగా ఎనుముల బ్రదర్స్‌పై పోలీసులు కేసు నమోదుచేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్రదర్స్ అరాచకాలు తట్టుకోలేక సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాముకుంట్ల సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం. ఇది ఆత్మహత్య కానే కాదు.. ముఖ్యమంత్రి సోదరులు చేసిన హత్య. ఆరు నెలల క్రితం ఒక యూట్యూబ్ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారనే కక్షతో 40 ఏండ్ల క్రితం కట్టుకున్న ఇంటి ముందు పశువుల దవాఖాన నిర్మించడమే కాకుండా.. సీఎం ఆదేశాలతో ఇంటికి దారి కూడా లేకుండా అడ్డంగా గోడ కట్టేందుకు పూనుకోవడంతోనే తీవ్ర మనస్తాపానికి గురై సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు.

ఇది అరాచక పాలన

'రెండుసార్లు కొండారెడ్డిపల్లికి సర్పంచ్‌గా పనిచేసి ఎన్నో సేవలందించిన వ్యక్తిని గౌరవించాల్సింది పోయి, 85 ఏండ్ల పెద్దాయన అని కూడా చూడకుండా కొన్ని నెలలుగా వేధింపులకు గురిచేయడంతో తట్టుకోలేకే చివరికి పురుగుల మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదుచేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలి. ఇటీవల సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో గిరిజన ఆడబిడ్డలపై దమనకాండను దేశం మరిచిపోక ముందే.. సీఎం సొంత గ్రామంలో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చూస్తుంటే రాష్ట్రంలో సీఎం, ఆయన సోదరుల అరాచకాలకు అంతేలేకుండా పోయిందని స్పష్టమవుతున్నది. ఇది ప్రజాపాలన కాదు.. అరాచక పాలన, నియంత పాలన, దుర్మార్గపు పాలన' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

గోడకట్టి ఏం సాధించారు? : నిరంజన్‌రెడ్డి

సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకోవంపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'పిచ్చుకల మీద బ్రహ్మాస్త్రమా? కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు ప్రభుత్వం, రేవంత్ కుటుంబం బాధ్యత వహించాలి. గోటితోపోయే సమస్యలను గొడ్డలిదాకా తెస్తున్నారు. జీవిత చరమాంకంలో ఉన్న సాయిరెడ్డి ఇంటికి దారిలేకుండా గోడకట్టి ఏం సాధించారు? సాయిరెడ్డి ఆత్మహత్యకు కారకులైన వారందరి మీదా చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ పాలనలో మనుషుల ప్రాణాలకు, వారి ఆకాంక్షలకు విలువ లేకుండా పోయింది' అని ఆవేదన వ్యక్తంచేశారు.

కన్నుమిన్ను కానని అహంకారం: దాసోజు ఆగ్రహం

'మాజీ సర్పంచ్ సాయిరెడ్డి బలవన్మరణం.. రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుల రాక్షస మనస్తత్వానికి నిదర్శనం' అని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ శుక్రవారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కన్నుమిన్నుకానని అహంకారంతో ప్రజాపాలన పేరు మీద నిరంకుశ పాలన కొనసాగిస్తున్న నియంత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి' అని ధ్వజమెత్తారు. తమ స్వగ్రామంలో ఓ మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకొనే బలీయమైన పరిస్థితులు కల్పించడం సీఎం సోదరుల రాక్షస మనస్తత్వానికి, నేర ప్రవృత్తికి నిదర్శనం. సాయిరెడ్డి సూసైడ్ నోట్ ఆధారంగా రేవంత్‌రెడ్డితోసహా ఆయన సోదరులపై ఆత్మహత్యా ప్రేరేపణ సెక్షన్ 108, భారత న్యాయ సంహిత ఆధారంగా కేసు నమోదు చేయాలి. నేరస్తులను కఠినంగా శిక్షించాలి' అని శ్రవణ్ డిమాండ్ చేశారు.

ఎనుముల బ్రదర్స్‌పై హత్యకేసు పెట్టాలి: హరీశ్‌రావు

మాజీ సర్పంచ్‌ను ఆత్మహత్యకు ఉసిగొల్పిన ఎనుముల బ్రదర్స్‌పై హత్యకేసు పెట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. 'కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడడం కలచివేసింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి సొంత గ్రామంలో ఉన్న దారుణ పరిస్థితికి సాయిరెడ్డి ఆత్మహత్య నిదర్శనం. రేవంత్.. నీ సొంత గ్రామ మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు ఉసిగొల్పిన వాళ్లపై చట్టరీత్యా చర్యలకు సిద్ధమా? మీ అన్నదమ్ముల అరాచకాలు శ్రుతిమించాయనేందుకు ఇది నిదర్శనం కాదా? సాయిరెడ్డి మృతికి కారణమైన మీ అన్నదమ్ములపై హత్యా నేరం పెట్టాలి' అని హరీశ్ డిమాండ్ చేశారు.

కొండారెడ్డిపల్లిలో భయం.. భయం

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): 'సర్.. నాకు 60 ఏండ్లు. ఇప్పటి వరకు భయం అంటే ఎట్లుంటదో తెల్వదు. కానీ, ఇవ్వాళ భయం అంటే తెల్సింది. మా ఊర్లె ఎన్నడూ ఇట్ల లేకుండె' అని సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామానికి చెందిన ఓ రైతు 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ చెప్పారు. మావోయిస్టులను కూడా చూశామని, మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు కూడా చూశామని, అప్పుడు కూడా ఇట్లా అనిపించలేదని పేరు చెప్పవద్దంటూ ఆ రైతు ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రానికి తమ ఊరి వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యాడని సంతోష పడాలో గ్రామంలో అందరినీ ఇట్ల వేధిస్తున్నందుకు బాధపడాలో తెలియని పరిస్థితి ఉన్నదని వాపోయారు. ప్రస్తుతం సీఎం సొంత గ్రామంలో ఉన్న భయానక వాతావరణానికి రైతు మాటలు ఒక ఉదాహరణ మాత్రమే. కొన్ని నెలల క్రితం తెలుగు మీడియాకు చెందిన పలువురు మహిళా జర్నలిస్టులు కొండారెడ్డిపల్లికి వెళ్లినప్పుడు అక్కడ చేదు అనుభవాలు ఎదురైన విషయం తెల్సిందే. సినిమాల్లో చూపించినట్టుగా మహిళా జర్నలిస్టులను వెంటాడి.. వేటాడి ఇబ్బందులు పెట్టిన ఘటన మరువక ముందే మాజీ సర్పంచినే రేవంత్‌రెడ్డి అన్నదమ్ములు ఇబ్బందులు పెట్టి ఆత్మహత్య చేసుకునేలా ఉసిగొల్పడం తీవ్ర చర్